

రాజరాజేశ్వరి ఆలయ ఆశ్రమాన్ని సీజ్ చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



రేణిగుంట రాజరాజేశ్వరి ఆలయ ఆశ్రమాన్ని సీజ్ చేయాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిఎస్పికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ గత నెల 19వ తేదీన దయ్యం వదిలిస్తానని చెప్పి 14 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన రాజరాజేశ్వరి ఆలయానికి సంబంధించిన ఆశ్రమ నిర్వాహకుడు కోదండ రామారావుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలన్నారు. మూఢనమ్మకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. డిఎస్పి స్పందిస్తూ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని, దోషులను వెంటనే అరెస్టు చేస్తామని తెలిపారు. ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మి, రాజేశ్వరి, ఈశ్వరి, సత్యశ్రీ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, సుభాష్, బాల పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక' స్థానాలపై బిజెపి 'కన్ను'

- తిరుపతి బిజెపి ఎంపి సీటు రత్నప్రభకేనా..
- శ్రీకాళహస్తిలో పోటీకి 'కోలా' కుతూహలం
- 'టిడిపి'శ్రేణుల్లో అయోమయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అభ్యర్థులను తేల్చకనే చివరి వరకూ నాన్చుతూనే ఉంటారు. ఈసారి జనసేన, బిజెపిలతో పొత్తులో భాగంగా సగానికి పైగా సీట్లు తేల్చకనే అయోమయంలో ఉన్నారు. దీంతో నియోజకవర్గాన్నే నమ్ముకుని రెండు మూడేళ్లుగా పార్టీ ప్రచారం చేస్తున్న ఇన్‌ఛార్జిల్లో టెన్షన్ నెలకొంది. ముఖ్యంగా తిరుపతి, శ్రీకాళహస్తి సీట్లు జనసేన, బిజెపి పొత్తులో భాగంగా ఆ రెండు పార్టీలకు తన్నుకు పోతాయని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే తిరుపతి సీటు జనసేనకేనని పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు ప్రకటించారు. తిరుపతి, శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక క్షేత్రాలైన వాటిలో ఒకటి ఖచ్చితంగా తమకు కావాలని బిజెపి పట్టుబట్టడంతో సోమవారం ప్రకటించాల్సిన తుది జాబితా మరోసారి వాయిదా పడింది. 22 గంటల్లో ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చని సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే శ్రీకాళహస్తిలో బొజ్జల గోపాలక్రిష్ణారెడ్డి తనయుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి రెండేళ్లుగా ప్రచారంలో ఇంటిల్లిపాది దూసుకుపోతున్నారు. ప్రత్యర్థి అభ్యర్థి వైసిపి ఎంఎల్‌ఎ బియ్యపు మధుసూదన్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ అతని అక్రమాలను, భూకబ్జాలను ఎండగడుతూ ప్రచారంలో ముందంజలో ఉన్నారు. అయితే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్ ఢిల్లీలో మకాం వేసి శ్రీకాళహస్తి సీటు బిజెపికే కేటాయించాలని, తాను పోటీచేసి గెలిచి తీరుతానని కాకా పడుతున్నారు. ప్రచారం కోసం 50 లక్షల విలువైన నాలుగు ప్రచార వాహనాలను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా శ్రీకాళహస్తి నియోజకవర్గం మొత్తం పోస్టర్లు, బ్యానర్లతో నిండిపోయింది. కమలం గుర్తుకే మీ ఓటు అంటూ పోస్టర్లు వెలిశాయి. బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించాలని అధినేత చంద్రబాబునాయుడు, యువగళంలో నారా లోకేష్ గళంలో ప్రకటించి ఉన్నారు. దీంతో మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌సివి నాయుడు కినుక వహించారు. కోలా ఆనంద్‌కు టిక్కెట్ వస్తుందని నియోజకవర్గంలో చర్చ జరగడంతో కోలా ఆనంద్‌కు సీటు ఇచ్చినా మనస్ఫూర్తిగా గెలిపిస్తానని అనుయాయులతో చెబుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం హైదరాబాద్‌లో కూర్చుని లోకేష్ ద్వారా ఎలాగైనా టిడిపికే ఇచ్చేలా పట్టుబడుతున్నారు. నియోజకవర్గంలో మాత్రం బొజ్జల సుధీర్‌రెడ్డి టిడిపి తరుపున, వైసిపి అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి మధ్యే పోటీ ఉంటుందని చర్చ నడుస్తోంది. బిజెపికి ఇస్తే ఈ సీటు వైసిపికి సునాయాసం అవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. తిరుపతిలో నలుగురు పోటీ పడుతున్నప్పటికీ ఈ సీటు జనసేనకే దక్కనుంది. జనసేనలోకి వెళ్లయినా పోటీ చేయాలని టిడిపి ఆశావాహులు పావులు కదుపుతుండటం గమనార్హం. అలాగే తిరుపతి పార్లమెంట్ స్థానాన్ని బిజెపి తీసుకోవడంతో అక్కడ అభ్యర్థిగా కర్నాటక రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ రత్న ప్రభకు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే ఈ సీటును టిడిపి నుంచి ఆశిస్తున్న మాజీ మంత్రి పనబాక లక్ష్మికి తనకు సీటు కేటాయించకపోతే బిజెపి ఓటమి తథ్యమని బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.



ఎస్వీయూ రిజిస్ట్రార్ ఎవరో..!

రేసులో పలువురు ఆశావాహులు

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఓఎండి హుస్సేన్ మూడేళ్లుగా పదవిలో కొనసాగుతున్నారు. సాధారణంగా వర్సిటీ రిజిస్ట్రార్ పదవీకాలం ఒకటెండు సంవత్సరాలే. ప్రస్తుత రిజిస్ట్రార్ మూడేళ్లుగా ఉన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వనుండడంతో రిజిస్ట్రార్ మార్పుపై ఆసక్తి నెలకొంది. పలువురు ఆశావాహులు 'కర్చీఫ్' వేసి వేచి ఉన్నారు. ఈ మూడేళ్లలో బోధనేతర సిబ్బంది, అధ్యాపకులు, పరిశోధకుల ఆర్థికపరమైన ఫైల్స్ క్లియరెన్స్ ఇవ్వలేదన్న అపవాదు ప్రస్తుత రిజిస్ట్రార్‌పై ఉంది. ఎస్‌సిఎంఆర్‌లు, టైంస్కేల్ ఉద్యోగులు, శాశ్వత బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పలుమార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించకపోవడంతో నిరసనలూ చేపట్టారు. ఈ నేపథ్యంలో వచ్చే రిజిస్ట్రార్ ఎవరన్న ఆసక్తి వర్సిటీలో నెలకొంది.

గతంలో ఫిజిక్స్ విభాగానికి చెందిన ఆచార్య పి. శ్రీధర్ రెడ్డి పదవి కాలం ముగియడంతో అదే విభాగానికి చెందిన ఆచార్య ఓఎండి హుస్సేన్ ప్రభుత్వ పెద్దలు, జిల్లా మంత్రి అండదండలు, రిజర్వేషన్ కోటాలోని అంశాలు అన్నీ కలిసి రావడంతో రిజిస్ట్రార్ గా కొలువుదీరారు. పదవీకాలం కొనసాగింపునకు ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. పరిపాలనా భవనంలో రిజిస్ట్రార్ ఛాంబర్ ఓ నిగూఢ రహస్య నిధి లాంటిది. అందులో ఎన్నో ఆర్థికపరమైన చిక్కుముళ్లు. చేతులు తడిపితేనే ఫైల్ ముందుకు కదలదన్న ఆరోపణలూ ఉన్నాయి. విద్యార్థి సంఘాల నేతల నుంచి ఉంది. ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉన్న ఈ పదవిపై పలువురు ఇంజనీరింగ్, సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్ కళాశాలల ఆచార్యులు కన్నేసి ఉన్నారు. మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రభుత్వ పెద్దలతో ఎవరికి వారే తమ తమ స్థాయిల్లో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. 'సామాజిక న్యాయం' నెలకొల్పే దిశగా ఉన్నతాధికారుల అధికార విభజన జరగాలని విద్యార్థి సంఘాల నేతలు వీసికి విన్నవిస్తున్నట్లు అందజేశాయి. సమర్థుడు, పరిపాలనా అనుభవం కలిగిన వారికే రిజిస్ట్రార్ పదవిని విద్యార్థులు, వర్సిటీ శ్రేయస్సు కోసం పనిచేసేవారిని నియమించాలని వర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

ఎర్రచందనం కూలీలు ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలో గొడ్డళ్లు, రంపాలతో చొరబడుతున్న ఆరుగురిని టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆర్ ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఏఆర్ ఎస్ ఐ మహేశ్వర నాయుడు టీమ్ భాకరాపేట అనంతపురం హై వే లోని ఒక ప్రయివేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. అక్కడ కొంతమంది వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా వారిని చుట్టుముట్టారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఆరుగురిని పట్టుకో గలిగారు. వారిని సత్యసాయి జిల్లాకు చెందిన హరి (43), తిరుపతి రూరల్ కు చెందిన మురగయ్య (27), తమిళనాడు కళ్లకురిచ్చి కి చెందిన వెల్ మురుగన్ (46), ఏలుమలై (46), మురుగన్ తంగవేల్ (37), మహేంద్రన్ మురుగేషన్ (30) లను అరెస్ట్ చేశారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలిస్తున్నారు. పట్టుబడ్డ వారి నుంచి 3 బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ లో నమోదు చేయగా సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఉద్యోగులకు బహుమతులు ప్రదానం

తిరుపతి టౌన్ : అల్ ఇండియా రైల్వే మన్స్ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాల సందర్భముగా, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, గుంతకల్ డివిజన్ లోని అన్ని బ్రాంచులలో క్రికెట్ టోర్నమెంట్లు మార్చ్ 8 ,9 తేదీల్లో అగ్రికల్చరల్ కాలేజీ గ్రౌండ్ నందు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.సదరు మ్యాచ్ కు సంబంధించిన విన్నెర్స్, రన్నర్స్ ట్రోఫీ లను మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కొప్పాల సత్యనారాయణ చేతి మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిషనల్ ప్రెసిడెంట్ కె సుదర్శన్ రాజు, టెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ రవీంద్ర నాయక్, చైర్మన్ నారాయణస్వామి పాల్గొన్నారు.

వైసిపి నేతల కబ్జాను అడ్డుకున్న సిపిఎం

ప్రజాశక్తి - రేణిగుంట

కరకంబాడి పంచాయతీ తారకరామ నగర్‌లోని శివాలయ ప్రాంతంలో ప్రజావసరాల కోసం ఉంచిన ప్రభుత్వ స్థలాన్ని తమకు పట్టాలిచ్చారంటూ 12 మంది భూముల్లోకి ప్రవేశించడంతో స్థానిక సిపిఎం నాయకులు, ప్రజలు కలిసి అడ్డుకున్నారు. 2010లో తమకు పట్టాలిచ్చారని జెసిబిలతో భూముల్లోకి ప్రవేశించడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. 2010లో వైసిపి అధికారంలోనే లేదని, ఎంఆర్ఒ వెంకటరమణ ఎలా పట్టాలిస్తారని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. విఆర్ఒ సంఘటనా స్థలానికి చేరుకుని పట్టాలను పరిశీలించి రికార్డుల్లో లేవని ప్రకటించారు. స్థానిక ఎంఎల్ఎ చెబితే రేణిగుంట తహశీల్దార్ పట్టా ఇచ్చారని చెప్పుకుంటూ ప్రభుత్వ భూముల్లో ప్రవేశించడాన్ని ఇళ్లస్థలాల పోరాట



కమిటి అధ్యక్షులు రాజశేఖర్ ఖండించారు. కరకంబాడి పంచాయతీలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, పేదవాళ్లకు మాత్రం ఇంటి స్థలాలు చూపించడం లేదన్నారు. ఇళ్లు లేని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చంద్రమౌళి, జ్యోతీష్, రాజా, అభిరామ్, నాగరాజు, ప్రశాంత్, రాధిక పాల్గొన్నారు.

మహిళలు మానసిక ఒత్తిడిని అధిగమించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి



వ ం వి ా ళ ౕ ల ు పురుషులతో పోలిస్తే రెండు నుంచి మూడు శాతం ఎక్కువ మానసిక రోగాలైన ఒత్తిడికి, ఆందోళనకు గురవుతారని, వీటితో పాటు గర్భాశయ, రుతుస్రావం, హార్మోన్ మార్పిడి వల్ల ఎక్కువ మానసిక రుగ్మతలకు లోనయ్యే అవకాశం ఉంటుందని డాక్టర్ గణేష్ అన్నారు. మహిళలు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్విమ్స్‌లో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, స్విమ్స్ సంచాలకులు ఆర్‌వి కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ, డాక్టర్ వనజాక్షమ్మ, డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి తదితరులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని రపారంభించారు. మహిళా హక్కులు, సమానత్వం, సాధికారత, సామాజిక మార్పుపై అవగాహనతో పాటు, వీటి సాధన కోసం ఉద్యమించాల్సిన కర్తవ్యాన్ని వక్తలు వివరించారు. ఇంటా బయట మహిళలు ఎదుర్కొనే సమస్యలు, పునరుత్పత్తి హక్కులు, లైంగిక దోపిడీ విషయాలను తెలియజేశారు. ఆటలు, వ్యాయామం, యోగా మానసిక ఆరోగ్యానికి అవసరమని అన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

రుయా నాలుగో తరగతి ఉద్యోగుల చర్చలు సఫలం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రుయా హాస్పిటల్లో పనిచేస్తున్నటువంటి పర్మినెంట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రుయా యాజమాన్యంతో సిఐటియు నేతల సమక్షంలో మంగళవారం కార్మికులు జరిపిన చర్చలు సఫలం అయ్యాయని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బాలసుబ్రమణ్యం, కందారపు మురళి తెలిపారు. ఇటీవల అనివార్యంగా సమ్మె బాట పట్టాలని నిశ్చయించుకున్న సందర్భంగా యాజమాన్యం పిలిచి కార్మికులు పెట్టినటువంటి 19 డిమాండ్లపై రెండు గంటల సమయం చర్చించిందన్నారు. ఉద్యోగుల కొరత ఉన్నందున రిక్రూట్‌మెంట్ చేయాలని, కార్మికులపై పనిభారాన్ని తగ్గించాలని, యూనిఫాం కల్పించాలని, ఆరోగ్య రుసుము పర్సంటేజి పెంచాలని, సీనియార్టీ ప్రకారం సార్జెంట్‌ను నియమించాలని, ఎఫ్ఎన్ఒలకు డ్రెస్సింగ్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. రుయా సూపరింటెండెంట్ రవిప్రభు సానుకూలంగా స్పందించారు. నాయకులు కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, రుయా ఆస్పత్రి కార్యదర్శి గురవయ్య, ప్రధాన కార్యదర్శి నరసింహులు, మధు, మునిచంద్ర, మధుబాబు పాల్గొన్నారు.

నేటినుండి శ్రీవాణి ట్రస్టు డొనేషన్ కౌంటర్ ప్రారంభం

తిరుపతి బ్యూరో : విమానయాన ప్రయాణికుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్టు డొనేషన్ కౌంటర్‌ను తిరుపతి విమానాశ్రయంలో 13వ తేదీ బుధవారం నుంచి పున్ణప్రారంభించనున్నారు. గతంలో వలే శ్రీవాణి టిక్కెట్లు విమానయాన ప్రయాణికులకు అందుబాటులో ఉంచనున్నారు. భక్తులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని టిటిడి పేర్కొంది.

9వేల మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మూడో విడత పట్టాల పంపిణీలో టిటిడి చైర్మన్

అతి తక్కువ వ్యవధిలో టిటిడిలో పనిచేస్తున్న 9వేల మందికి పైగా ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వడంతో తన జీవితం ధన్యమైందని టిటిడి ధర్మకర్తల మండలి అద్యక్షులు భూమన కరుణాకర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో మంగళవారం మూడో విడత ఇళ్లపట్టాల పంపిణీ పండుగ కార్యక్రమంలో చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈవో ఎవి ధర్మారెడ్డితో కలిసి నాలుగువేల మంది ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇంటి స్థలాల ప్రొసీడింగ్స్ అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ 16 ఏళ్ల క్రితం టిటిడి చైర్మన్‌గా ఉన్నపుడు అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలతో టిటిడి ఉద్యోగులకు ఇళ్లస్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నించామన్నారు. రెండోసారి తనకు టిటిడి చైర్మన్‌గా వచ్చిన అవకాశం సర్వీసులో ఉన్న ఉద్యోగులతో పాటు, విశ్రాంత ఉద్యోగులకూ ఇళ్లస్థలాలు ఇచ్చేందుకేనని అన్నారు. వడమాలపేట, పాదిరేడు అరణ్యం వద్ద రెండు విడతల్లో 432 ఎకరాల్లో 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించామన్నారు. ప్రస్తుతం ఏర్పేడు మండలం పల్లం వద్ద ఉద్యోగులకు, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు కలిపి 4000 మంది ఇంటి స్థలాలు కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన ఉద్యోగులు, పెన్షనర్లకు అందరికీ తప్పకుండా ఇంటి స్థలాలు కేటాయిస్తామని తెలియజేశారు. అదేవిధంగా టీటీడీలోని కార్పొరేషన్, కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్, ఎఫ్ఎంఎస్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు తదితరులందరికీ రు.5 వేల నుండి రూ.20 వేల వరకు వేతనాలు పెంచినట్లు తెలియజేశారు. ఇలాంటి మంచి పనులు చేపట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డికి, జేఈవో వీరబ్రహ్మంకు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ కొన్ని పత్రికల్లో వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. వడమాలపేట వద్ద లేఔట్ పనుల కోసం రూ.150 కోట్లు వెచ్చించామన్నారు. ఏర్పేడు మండలం పల్లం గ్రామం వద్ద రూ.90 కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.240 కోట్లు టీటీడీ ఖర్చు చేసిందని తెలిపారు. ఉద్యోగులు ఇప్పటివరకు రూ.85 కోట్లు టీటీడీకి తిరిగి చెల్లించారని, మిగిలిన ఉద్యోగులందరూ టీటీడీకి సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు రామాయణం ప్రదర్శన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ

ఈనెల 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో సన్నద్ధతలో భాగంగా కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల నిర్వహణలో భాగంగా రామాయణాన్ని విద్యార్థులకు ప్రదర్శించామని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు యువశ్రీ మురళి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు రామాయణం పాఠ్యాంశం ఉందని, 20 మార్కులకు ఈ ఉపవాచకం రామాయణం నుంచి అడుగుతారని తెలిపారు.



వ్యాయామ ఉపాధ్యాయులు దాసు పాల్గొన్నారు.

తెలుగు భాషను ఆధునిక తరాలకు అందించండి



ప్రజాశక్తి - క్యాంపస్

తెలుగు భాషలోని మాధుర్యాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను ఆధునిక తరాలకు అందించాలని తెలుగు సంస్కృత అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్స్ లక్ష్మీ శివపర్వతి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, భారతీయ భాషా సమితి, న్యూఢిల్లీ, సంస్కృత భారతిల సంయుక్త ఆధ్వర్యంలో చెలికాని అన్నారావు సభా మందిరంలో మంగళవారం భారతీయ భాషా సమ్మేళనంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ తెలుగు భాషను సంరక్షించడం, తెలుగు భాషలో ఉన్నటువంటి గొప్ప గొప్ప గ్రంథాలను, విషయాలను ఆధునిక తరానికి అందించడం, ప్రత్యేకించి సంస్కృత, తెలుగు భాషల్లో పరిశోధన చేయడం ద్వారా సంస్కృత భాషను, తెలుగు భాషను సంరక్షించడమే సంస్కృత, తెలుగు అకాడమీ ప్రధాన లక్ష్యమని వివరించారు. ఇటువంటి చక్కటి సమ్మేళనాన్ని సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని, ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉప కులపతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య జి.యస్.ఆర్ కష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొ.టి.వి.రాఘవాచార్యులు, ఇన్చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.జె.రమాశ్రీ, సమ్మేళనం కోఆర్డినేటర్ డా.ఎస్.ఎల్ సీతారామశర్మ పాల్గొన్నారు.

ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలి: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రానున్న సార్వత్రిక ఎన్నికలు – 2024 నేపథ్యంలో నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కలిగి సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. లక్ష్మీ శ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు సార్వత్రిక ఎన్నికలు– 2024 విధులకు కేటాయించబడిన నోడల్ అధికారులకు ఎన్నికలలో నిర్వహించవలసిన విధులపై వారి సన్నద్ధత కొరకు కలెక్టర్ జెసి శుభం బన్సల్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు – 2024 నిర్వహణలో నోడల్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులపై ఒక పక్కా ప్రణాళికతో అవగాహన కలిగి సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. స్వీప్ కార్యక్రమాల రూప కల్పనతో ఓటరు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా మోటివేషన్ కలిగించాలని సూచించారు. డిఆర్ఓ పెంచల కిషోర్, ఎలక్షన్ సూపెరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించండి

తిరుపతి టౌన్ : రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అందరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి , నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. ఎన్నికల విధుల నిర్వహణపై మంగళవారం సెక్టోరల్ ఆఫీసర్స్, సూపర్ వైజర్స్, బి.ఎల్.ఓ లకు కచ్చపి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి అదనపు ఓటర్ నమోదు అధికారి, అర్బన్ ఎమ్మార్వో వెంకట సూర్యనారాయణ రెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు.





కల్యాణం..కమనీయం..!

రూ.20 కోట్లతో టిటిడి కల్యాణ మండపాల ఆధునీకరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పెళ్లంటే నూరేళ్ల పంట.. జీవితాంతం మదిలోనే కాదు.. ఆల్బమ్‌లోనూ అందంగా బంధించే ఓ మధుర జ్ఞాపకం.. కల్యాణాన్ని కమనీయంగా కనుల విందుంగా ఆకర్షణీయంగా నిలిపేందుకు టిటిడి కల్యాణ మండపాలు నూతనంగా ముస్తాబయ్యాయి. రూ.20 కోట్లతో ఆధునీకరణ పనులు చేపట్టి లైట్‌సెట్టింగ్, సెంట్రల్‌ఏసీ, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి. సరికొత్త హంగులతో శ్రీనివాస, శ్రీ పద్మావతి కల్యాణ మండపాలు అందంగా ముస్తాబయ్యాయి.

ప్రపంచ ప్రఖ్యాత ధార్మికసంస్థ టిటిడి తన పరిధిలోని సేవలను మరింత సరళతరం చేస్తుంది. తక్కువ ఖర్చులతో సకల సౌకర్యాలతో పెళ్లి వేడుకలను చేసుకునేందుకు దేశ వ్యాప్తంగా 320 కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. తిరుపతిలో దశాబ్దాల తరబడి వివాహ వేడుకలకు వేదికగా నిలిచిన తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న శ్రీనివాస కల్యాణ మండపాలు, లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని శ్రీపద్మావతి కల్యాణ మండపాలను పూర్తిస్థాయిలో సెంట్రల్ ఏసి చేసి, అధునీకరించాలని టిటిడి భావించింది. అనుకున్నదే తడవుగా ఆధునీకరణ పనులకు టెండర్లను ఆహ్వానించి, కరోనా సమయంలో సైతం పనులను చేపట్టి ఏడాది క్రితం పూర్తి చేసింది. శ్రీనివాస కల్యాణ మండపాల్లో నాలుగు బ్లాక్‌లు, శ్రీపద్మావతి కల్యాణ మండపాల్లో 3 బ్లాక్‌లను సెంట్రల్ ఏసి చేసి, వివిధ రకాల పనులు పూర్తి చేసి, ఆకర్షణీయమైన పెయింటింగ్, ఫర్నిచర్, విద్యుత్ లైట్ సెట్టింగ్‌లతో ఆకర్షణీయంగా సిద్ధం చేసింది. అప్పటి నుంచి రెండు మండపాల్లోని 7 బ్లాక్‌లో నిత్యం పచ్చతోరణం, నిత్యకల్యాణం అనే రీతిలో అక్కడ వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ప్రయివేట్, ఇతరాత్ర కల్యాణ మండపాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించినా సరైన సౌకర్యాల కల్పన ప్రశ్నార్థకమే. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న కల్యాణ మండపాల్లో విశాలమైన పార్కింగ్ ప్రదేశం, ఆహ్లాదకరమైన వాతావరణం, నిత్యం జానపద, గోవింద నామాలు, సంకీర్తనలతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కల్యాణమండపాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాస్తవానికి ఈ ఏడు బ్లాక్‌లను ప్రస్తుతం ఉన్న సౌకర్యాలతో నూతనంగా నిర్మిస్తే 300 కోట్ల రూపాయలకుపైగానే ఖర్చు అయ్యేది. టిటిడి అధికారులు దీనిపై చర్చించి, కేవలం అదునీకరణ, సుందరీకరణ పనుల ద్వారా కేవలం 50 కోట్ల రూపాయలతోనే పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. చివరికి అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో కేవలం 20 కోట్ల రూపాయలతోనే పనులు పూర్తి, అధునీకరించిన కల్యాణమండపాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

క్లిక్‌కొట్టు ...కల్యాణమండపాలను పట్టు

గతంలో లాగా కల్యాణ మండపాల బుకింగ్ కోసం ఆఫ్‌లైన్‌లో ఆయా ప్రాంతాల్లోకి తిరగాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు టిటిడి అన్ని కల్యాణ మండపాలను కంప్యూటకరణ చేయడంతో ఆన్‌లైన్‌లోనే, ఆఖరికి చరవాణి (సెల్‌ఫోన్)లోనే కల్యాణ మండపాలను బుక్ చేసుకోవాచ్చు. టిటిడి వెబ్‌సైట్ ద్వారా క్లిక్ కొట్టు కల్యాణమండపాలను పట్టు అనే రీతిలో అతి సులభవంతంగా కల్యాణ మండపాలను బుకింగ్ చేసుకోవచ్చు. కల్యాణ మండపాల అద్దె కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించొచ్చు. కల్యాణ మండపం బుకింగ్ మెసెజ్‌ను మాత్రమే ఆయా కల్యాణ మండపాల వద్ద విధుల నిర్వహించే ఉద్యోగులకు చూపిస్తే సరిపోతుంది.

చైర్మన్ సాహసోపేతమైన నిర్ణయం : తేజ, టిటిడి కాంట్రాక్టర్

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం. దేవస్థానం ఈవో, జేఈవోల పర్యవేక్షణ, ముందుచూపు నిర్ణయాల వల్ల అతి తక్కువ వ్యయంతో శ్రీనివాస, శ్రీపద్మావతి కల్యాణమండపాల్లోని ఏడు బ్లాక్‌లు సెంట్రల్ ఏసితో, ఆధునీకరణ పనులతో, ఏడాది క్రితం అందరికీ అందుబాటులోకి వచ్చాయి.



సంస్కృత వర్సిటీ వీసీకి జాతీయ అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లాలో సర్వ వేదిక సంస్థాన్ అనే సంస్థ జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తికి 'శ్రీ భాష్యం విజయసారథి జాతీయ అవార్డు'ను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సర్వ వైదిక సంస్థానం వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి సాహిత్య శాస్త్రంలో నిష్ణాతులు, శాస్త్రజ్ఞులు, వివిధ అంశాలలో శాస్త్రజ్ఞానంతో పాటు పరిపాలనా కౌశలం కూడా కలిగిన గొప్ప వ్యక్తిగా వర్ణించారు. అటువంటి గొప్ప పండితులకు పురస్కారాన్ని తమ సంస్థాన ద్వారా ఇవ్వడం ఎంతో ఆనందదాయకమని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని సంస్కృత భాషా పండితులు పాల్గొని, శాస్త్ర చర్చను నిర్వహించారు.

రాష్ట్ర రెజ్లింగ్ పోటీలకు తిరుపతి జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : రాష్ట్ర రెజ్లింగ్ పోటీలకు తిరుపతి జిల్లా జట్టును మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో తిరుపతి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 20 రెజ్లింగ్ టీం సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్, కార్యదర్శి ఆర్ శ్రీధర్, తిరుపతి డి.ఎస్.డి.ఓ సయ్యద్ సాహెబ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ రెజ్లింగ్ క్రీడాకారులు దేహదారుఢ్యంతోపాటు మానసికంగా కూడా దృఢంగా ఉండే పోటీలలో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ సురేష్, గోపి నాయుడు పాల్గొన్నారు.

16న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీ జాబ్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. జాబ్ ఫెస్ట్ ను ఆంధ్రప్రదేశ్ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, రాష్ట్ర నైపుణ్య సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ జాబ్ ఫెస్ట్ కు నగరి, కార్వేటి నగరం, పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిధిలో పురుషులు, స్త్రీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సత్యవేడు నుండి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. విద్యార్థులు బయోడేటా నాలుగు కాపీలు, ఫోటోలు నాలుగు కాపీలు, నైపుణ్యతలకు సంబంధించిన ఫోటో కాపీలు నాలుగు తీసుకొని రావాలని సూచించారు. విద్యార్థులు జాబ్ ఫెస్ట్ కు ఉదయం 9 గంటలకు కళాశాల వద్దకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో 20 కంపెనీల ప్రతినిధులు హాజరవు తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ జాబ్ ఫెస్ట్ లో 1900 ఉద్యోగ అవకాశాలు వున్నాయని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో గూడూరు రెండో పట్టణంలోని మినీ గురుకులంలో నిర్వహించిన వైద్యశిబిరంలో పట్టణానికి చెంది న పలువురు వైద్యులు విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులు, సలహాలు అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షులు డాక్టర్ రోహిణి మాట్లాడుతూ రోటరీ క్లబ్ వెస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో తాము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థినిలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సనత్ కుమార్ రెడ్డి, ధనుంజయరెడ్డి, శ్రీకంటి రామ్మోహన్ రావు, మయూరి శ్యాం యాదవ్ పాల్గొన్నారు.

'పదవ తరగతి పరీక్షలు విద్యార్థికి తొలిమెట్టు'

ప్రజాశక్తి - రేణిగుంట : పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల అభివృద్ధికి తొలిమెట్టని ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ప్రత్యూష ఆధ్వర్యంలో పాత చెక్ పోస్ట్ లో ఉన్న జడ్పీహెచ్ హైస్కూల్ లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ను ముఖ్య అతిథులు రేణిగుంట సర్పంచ్ నగేషం, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగేషం , జూలియన్ రాజు, ప్రత్యూష మాట్లాడారు. ప్రధాన ఉపాధ్యాయులు శౌరి మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ అందించిన చేయూత సోషల్ సర్వీస్ వారికి, ముఖ్య అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయూత సోషల్ సర్వీస్ కార్యదర్శి శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి అసెంబ్లీ సీటు టిడిపి, జనసేన కివ్వాలి: బుజ్జిబాబు నాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పార్లమెంటు స్థానాన్ని బిజెపికి ఇవ్వడం సంతోషమేనని, కానిపోతే తిరుపతి స్థానిక ప్రజల అభీష్టం మేరకు తిరుపతి అసెంబ్లీ స్థానాన్ని టిడిపి, జనసేనలకు మాత్రమే ఇవ్వాలని టిడిపి సీనియర్ నాయకుడు బుజ్జి బాబు నాయుడు అభిప్రాయానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో టిడిపికి దాదాపు లక్ష మందికి పైగా పార్టీ అభిమానులు, సానుభూతిపరులు ఉన్నారని అసెంబ్లీ స్థానాన్ని టిడిపికి, జనసేన కేటాయిస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. మళ్లీ చర్చించి ప్రకటన చేయాలని కోరారు. స్థానిక ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో లక్ష్మీపతి నాయుడు, సుబ్బరాయలు నాయుడు, సురేంద్ర నాయుడు, నాగేంద్ర కుమార్, మన్యం శ్రీనివాసులు, జీడి నాయుడు, మధు యాదవ్ పాల్గొన్నారు.

పులివర్తి నాని ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -రామచంద్రాపురం: రాష్ట్రంలో టిడిపి తోనే దళితుల సంక్షేమం సాధ్యమవుతుందని మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు బి చిరంజీవి అన్నారు. మంగళవారం మండలంలోని కమ్మపల్లి పంచాయతీలోని దేవరు కండ్రిగ దళితవాడలో మండల ఎస్సీ సెల్ నాయకులు చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధు, మణికంఠ,రవి, రాజా, శేషాద్రి ప్రసాద్, మహేష్, రాజశేఖర్, వెంకటరమయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి నాయుడుపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జెడ్పీ హైస్కూల్ లో విద్యా జిల్లా కమిటీ సభ్యురాలు చిత్త చంద్రకళ అధ్యక్షతన 'మహిళల హక్కులే మానవ హక్కులు' అంశంపై సదస్సు నిర్వహించారు. పలువురు మహిళా ఉపాధ్యాయులు, విద్యా నాయకురాలు మాట్లాడారు. ఇన్ ఛార్జి హెచ్ఎం సావిత్రి మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీ ఉండాలని అలాంటి సమాజం కోసం ప్రతి మహిళ ఐక్యంగా ముందుకెళ్లాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు మహిళలు సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని వివక్షకు వ్యతిరేకంగా మహిళ లోకం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. లక్ష్యాలు ఆత్మవిశ్వాసంతో ఛేదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్లు వసంతకుమారి, కోమలి, షర్మిల, మహాలక్ష్మి, శ్యామలమ్మ, పద్మావతి, మణెమ్మ, మధ్యాహ్న భోజన పథక జిల్లా కార్యదర్శి కె విజయమ్మ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి.గోపాలయ్య సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చాపల.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు వివిధ పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా, తిరుపతి జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం , విశ్వం హై స్కూల్ వినియోగదారుల స్కూల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు 'వినియోగదారుల హక్కులు - బాధ్యతలు' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఈ నెల 13 తేదీ ఉదయం 10 గంటలకు తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూలులో నిర్వహిస్తామని విజేతలకు విజేత లకు బహుమతులు అందిస్తామని తెలిపారు. జిల్లాలోని ఆసక్తిగల విద్యార్థులు పోటీల్లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు పి.రాజారెడ్డి, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ యన్.విశ్వనాథ్ రెడ్డి ,డైరెక్టర్ తెలిపారు.

సేవ, సామాజిక అవగాహనతోనే అభివృద్ధి: వీసి

ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రత్యేక సేవా శిబిరాలు, సామాజిక అవగాహన వ్యక్తిగత అభివృద్ధికి సోపానాలు అని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసి భారతి అన్నారు. ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాలు సామాజిక బాధ్యతను చాటుకునే సువర్ణ అవకాశమని ఆమె పేర్కొన్నారు. వారం రోజులపాటు తిరుపతి రూరల్ మండలం లోని యూనిట్ 3 ఏర్పాటు చేసిన ప్రత్యేక సేవా శిబిరానికి వెళ్లే వాహనానికి, ఆమె, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజనీతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి క్యాంపుల వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ విద్యావతి, కుంద్రపాకం పంచాయతీ సెక్రటరీ మురళి, సర్పంచ్ శుభా పద్మ నాభరెడ్డి, గ్రామప్రజలు సేవలందించాలని సంకల్పించి వాలంటీర్లు అభినందనలు తెలిపారు.

దగ్గమైన రేషన్ పంపిణీ వాహనం పరిశీలన

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం ఎం డి పుత్తూరులో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్గమైన నిత్యావసరాల పంపిణీ వాహనాన్ని సివిల్ సప్లై తిరుపతి మేనేజర్ మంగళవారం పరిశీలించారు. రేషన్ సరఫరా చేసే వ్యక్తితో మాట్లాడి షార్ట్ సర్క్యూట్ గల కారణం కనుక్కుని తగిన విధంగా ప్రభుత్వ సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్ ప్రియ, వీఆర్వో రవి, రేషన్ పంపిణీ దారుడు మహేష్ పాల్గొన్నారు.

వాతావరణ ప్రతికూల ప్రభావం!

- చెట్లలో కానరాని మామిడి పూత, పిందెలు - ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిపోతుందని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా నవంబరు, డిసెంబర్ లోనే చెట్లలో పూత ఏర్పడి, శివరాత్రికి పిందెలు రావాల్సి వుంది. అయితే గత ఏడాదిలో వచ్చిన మిచౌంగ్ తుపాను కారణంగా అసలే మామిడి పూతలు రాక రైతులు ఆందోళన చెందుతున్న తరుణంలో ఫిబ్రవరి ముగిసి మార్చి గడుస్తున్నా నేటికీ పూత కనిపించకపోవడంతో రైతన్నలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. భూమిలో తేమ శాతం అధికంగా ఉండటం, మంచు ప్రభావం ఎక్కువగా వున్నందు వల్లే ఎక్కడా పూత వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పూత కోసం రైతన్నలు వేలకు వేలు వెచ్చించి మందులు పిచికారి చేసినా పూత రావడం లేదు. దీంతో రైతుల్లో గుబులు మొదలైంది. గత మూడేళ్లలో కరోనా కారణంగా మామిడి వ్యాపారం తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికే రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ప్రకృతి కన్నెర్ర చేయడం, ప్రభుత్వం సహకరించకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. గతంలో పంట నష్టానికి ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి సహాయక చర్యలు అందించేవారు. ప్రస్తుత ప్రభుత్వం వాటికి తిలోదకాలు ఇవ్వడంతో రైతుల కంట కన్నీరు కనిపిస్తోంది. వడమాలపేట మండలంలో మామిడి 5,010 ఎకరాలు, పుత్తూరులో 4,700, నింద్రలో 4, విజయపురంలో 2,224, నగరిలో 1,285 ఎకరాలు సాగు చేస్తున్నారు. ఈ మండలాల పరిధిలో ఎక్కడ పూత కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా నుంచి కష్టాలే

గత మూడేళ్లుగా కరోనా వల్ల మామిడి వ్యాపారం దివాలా తీసింది. వేలకు వేలు అప్పులు చేసి మామిడి సాగు చేస్తుంటే ప్రతి కూల వాతావరణంతో దిగుబడి కాస్త తగ్గింది. అప్పులు, ఆత్మహత్యలు తప్ప ఆదుకునే నాథుడే కరువయ్యాడు. ప్రభుత్వం స్పందించి రైతులకు భరోసా ఇవ్వాలి.

- వెంకటాద్రి, దిగవ గూలూరు.



మామిడి చెట్లలో కనిపించని పూత, పిందెలు

విపత్తులతో నష్టపోతున్నాం

అసలే సాగుబడి అంతంత మాత్రంగా ఉంది. గిట్టుబాటు ధర లేక అవస్థలు పడుతుంటే తుపాను, ప్రతికూల వాతావరణం కారణంగా పంటకు నష్టం జరుగుతోంది. ప్రభుత్వం తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి.

-మోహన్, ఎగవ గూలూరు.

'తిరుమలను వ్యాపార పునరావాస కేంద్రంగా మార్చారు'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన తనయుడు భూమన అభినయ రెడ్డి పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలను వ్యాపార పునరావాస కేంద్రంగా మార్చుతూ కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నారని టిడిపి తిరుపతి నగర అధ్యక్షులు వట్టికుంట శంకరనారాయణ ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవడానికి తిరుమలలో వ్యాపారాలు చేసుకుంటున్న వారిని, హాకార్స్ లైసెన్సులు ఒకచోట నుండి మరొక చోటుకి మార్చుకోవడానికి కోట్ల రూపాయలు చేతులు మారాయని, గతంలో తిరుమలలో వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్న వారికి, తిరుమల పవిత్రతను కాపాడడానికి 2003లో అప్పటి టిడిపి ప్రభుత్వం 856, 528 జీవోలను తీసుకొచ్చిందన్నారు. కానీ నేడు ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తూ తిరుమలలో వ్యాపారాలు చేసుకోవడానికి అనుమతులిస్తున్నారన్నారు. ఈ ఆరోపణలపై టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి స్పందించి వివరణ ఇవ్వాలని, లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థలచే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దామ మురళి, లక్ష్మి, రేవతి, తులసి, నరేష్ కుమార్ రెడ్డి, నాగ ప్రతాప్, చంద్ర, మునిరాజ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సీడాప్- డిఆర్డిఏ ద్వారా అమలు చేస్తున్న దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికెవై) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలైన చిత్తూరు, వైయస్సార్ కడప, నెల్లూరు, అనంతపురం, కర్నూలు, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువత 2022-23, 2023-24 సంవత్సరానికి డి.డి.యు-జి.కే.వై శిక్షణ పొంది వివిధ రంగాలలో ఉపాధి పొందిన పూర్వ విద్యార్థులు దాదాపు 800 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఛైర్మన్ సాది శ్యాంప్రసాద్ రెడ్డి, సీడాప్ సీఈవో ఎం.కె.వి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందజేస్తున్నామని, డీడీయూ జీకే వై, సీడాప్ ద్వారా శిక్షణలో దేశంలో మన రాష్ట్రం 3వ స్థానంలో, ఉపాధి కల్పనలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. ఇది సీడాప్ డీడీయూ జీకేవై వారి కృషి ఇతర రాష్ట్రాల్లో నాణ్యత ప్రమాణాలు లేవని, శిక్షణ ఫలితాలు ఆశా జనకంగా లేవన్నారు. ముఖ్యమంత్రి నైపుణ్య శిక్షణను బలోపేతం చేసి సీడాప్ ద్వారా 76వేల మందికి శిక్షణ 52వేల మందికి ఉపాధి కల్పించారన్నారు. తీర ప్రాంతాల్లో ఉన్న పోర్టులు ఫిషింగ్ హార్బర్లు, వివిధ సంస్థలు కోట్ల రూపాయల పెట్టుబడులు రాను న్నాయన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేయర్ డాక్టర్ ఆర్ శిరీష మాట్లాడుతూ యువత ఉపాధిపై దృష్టి సారించిన ప్రభుత్వం కొత్త ఆలోచనలతో యువశక్తిని పెంపొందించే కార్యక్రమాలను రూపొందించి, వాటికి శిక్షణ కల్పించి ఉపాధిని ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఏ పీడీ జ్యోతి, సీడాప్ జేడీఎం సరితా రెడ్డి, సీడాప్ స్టేట్ మిషన్ మేనేజర్స్, సిబ్బంది, ట్రైనింగ్ పార్టనర్స్ పాల్గొన్నారు.



జ్ఞాపికలు అందిస్తున్న ఎంపి గురుమూర్తి

జగన్ అన్ని సమకూర్చారు: ఎంపీ

ప్రజాశక్తి- వెంకటగిరి: దేశంలో పేదరికం లేని రాష్ట్రంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలు నవరత్నాల ద్వారా అన్ని సమకూర్చారని, ఎలాంటి అవినీతి లేకుండా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు పంపిణీ చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎంపి ఎం గురుమూర్తి అన్నారు. జగనన్న ప్రజలకు ఇంటి స్థలాలు, ఇళ్లు నిర్మించి రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్నారని తెలిపారు. అనంతరం తిరుపతి వైసిపి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సచివాలయ అభివృద్ధి కార్యక్రమాలకి 50 లక్షలు చొప్పున 14 సచివాలయాలకు ఏడు కోట్లు రూపాయలు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఎంపీ గ్రాంట్స్ ద్వారా కోటి 85 లక్షల రూపాయలతో లైట్లు మంజూరు చేసామన్నారు. పిల్లలు చదువుకునేందుకు స్కూలు ఆధునీకరణ, ప్రతి ఒక్కరూ ఇంగ్లీష్ మీడియం చదవాలనే సదుద్దేశంతో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టారన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్క భానుప్రియ, జిల్లా గ్రంథాలయ శాఖ ఛైర్‌పర్సన్ దొంతు శారద, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు రామ్‌కుమార్‌రెడ్డి

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రాపురం: సాధారణ ఎన్నికల కోడ్ వెలువడనున్న నేపథ్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వేగంగా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలంలోని మల్లంగుంట, పెరుమాలపల్లి, పైడిపల్లి, గొల్లపల్లి, పాతకాలువ, లింగేశ్వర నగర్, అవిలాల, గ్రామ పంచాయతీలలో సిమెంట్ రోడ్లు, రచ్చబండ, కమ్యూనిటీ హాల్, ఆర్వో ప్లాంట్స్‌కు ప్రారంభోత్సవాలు చేశారు.

చంద్రగిరిలో: చంద్రగిరి మండలంలో అభివృద్ధి పనులను స్థానిక ఎంపీపీ హేమంత్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి యుగంధర్, చెవిరెడ్డి మోహిగ్‌రెడ్డి ప్రారంభోత్సవాలు చేశారు. చంద్రగిరి మండలం పనపాకం, కల్ రోడ్డుపల్లి, ఎం.కొంగరవారిపల్లి, ఐతేపల్లి, అగరాల, కొటాల, చిన్నరామాపురం, కందుల వారిపల్లి, నరిశింగాపురం, మిట్టపాళెం, రామిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలలో పూర్తి చేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. సీసీ రోడ్లు, రైతు భరోసా భవనాలు, వైయస్సార్ సమావేశ మందిరాలు, తారు రోడ్లు, గ్రావెల్ రోడ్లు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, పార్టీ కన్వీనర్ మస్తాన్, డివిజన్ పార్టీ అధ్యక్షులు అగరాల దేవారెడ్డి, బోస్ చంద్రారెడ్డి, పసల నాగరాజు, చేగు ప్రశాంత్ గుప్తా, సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఆర్ సిపురంలో: రామచంద్రాపురం మండలంలో కుప్పం బాదూరు, మిట్ట కండ్రిగ, రామాపురం, గంగిరెడ్డిపల్లి, పివిపురం, కమ్మ కండ్రిగ, గ్రామాలలో అభివృద్ధి పనులకు స్థానిక ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, జెడ్పిటిసి వి ఢిల్లీరాణి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాను కుమార్ రెడ్డి, టీ గిరిధర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, బాబు యాదవ్, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: దామలచెరువులో డ్వాక్రా మహిళలకు వైయస్ఆర్ చేయూత నాలుగో విడత చెక్కును డ్వాక్రా మహిళలకు చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి మంగళవారం అందించారు. పాకాల మండలంలో మహిళ సమైక్య నాలుగో విడత వైయస్ఆర్ చేయూత నాలుగు కోట్ల తొంబైఐదు లక్షల రూపాయలను వారి ఖాతాల్లోకి జమ చేశారని తెలిపారు. చెవిరెడ్డి లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి సహాయ సహ కారాలు అందించాలని కోరారు. పాకాల మండలంలోని మొగరాల, దామలచెరువు, ఉప్పరపల్లి, కొత్తవడ్డిపల్లి, మద్దినాయనపల్లి, పెద్దరామాపురం, గానుగపెంట, పాకాల, చెన్నుగారిపల్లి పంచాయతీలలో పలు గ్రామాలలో సిసి రోడ్లు, సమావేశ మందిరాలు, సచివాలయ భవనాలు, ఆర్వో ప్లాంట్, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారం భోత్సవం చేసి, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పిటిసి, మండల పార్టీ కన్వీనర్, డివిజన్ అధ్యక్షులు, వైస్ ఎంపిపి లు, ఎంపీటీసీలు,స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్స్, ఏఎంసీ ఛైర్మన్, డైరెక్టర్లు, ఆలయ ఛైర్మన్, కమిటీ మెంబర్స్, సింగిల్ విండో ఛైర్మన్, డైరెక్టర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న చెవిరెడ్డి లక్ష్మిరెడ్డి

బీసీ సంక్షేమ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని వెనకబడిన తరగతుల ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా వసతి గృహంలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ప్రీ ఫైనల్ పరీక్షలపై సమీక్షించారు. వసతి గృహంలో పదో తరగతి విద్యార్థులు 25 మంది ఉండగా వీరిలో పది మంది విద్యార్థులు ఏ గ్రేడ్ లోనూ, 11 మంది విద్యార్థులు బి గ్రేడ్ లోనూ నలుగురు విద్యార్థులు సీ గ్రేడ్‌లో వున్నట్లు ఆయన గుర్తించారు ఈసి గేటు లో ఉన్న నలుగురు విద్యార్థులను కచ్చితంగా ఉత్తీర్ణత సాధించేలా వసతి గృహ అధికారి రామయ్యను బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. వసతి గృహంలో ట్యూటర్స్ సరిగా లేని కారణంగా హిందీ, లెక్కలకు ట్యూటర్సు వున్నారు. మిగిలిన సబ్జెక్టులకు ట్యూటర్స్ లేనందువల్ల సంక్షేమ అధికారి పరీక్షల పూర్తయ్యే వరకు ప్రతిరోజూ వసతి గృహానికి వచ్చి విద్యార్థుల చదువులకు బాధ్యత వహించా లన్నారు. పరీక్షలు పూర్తయ్యేంతవరకు విద్యార్థులకు సదుపాయాలను కల్పించే బాధ్యత వసతిగృహ అధికారిదేనన్నారు. వసతి గృహ సిబ్బంది విద్యార్థుల చదువుకు సహకరించి ఉదయం రాత్రి చదివించేలా సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ అధికారి రామయ్య, వసతి గృహ సిబ్బంది, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న బిసి వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్‌రావు

పులివర్తి నాని గెలుపు బీసీల తోనే సాధ్యం

- చిట్టి బోయిన శంకర్ యాదవ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చంద్రగిరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, చిత్తూరు టిడిపి ఇన్‌ఛార్జ్ పులివర్తి నానిని 2024 ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యతతో గెలిపించుకుంటామని అఖిల భారతీయ యాదవ మహాసభ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబోయిన శంకర్ యాదవ్ పేర్కొన్నారు. శంకర్ యాదవ్ యువత శంకర్ యాదవ్ సేవ, బీసీ ప్రజలతో కలిసి పులివర్తి నానిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పులివర్తి నానిని బీసీలందరూ ఏకమై గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. నానికి ఎల్లవేళలా బీసీలు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నాని మాట్లాడుతూ మొదటి నుంచి టిడిపికి బీసీలు అంటే వెన్నెముక లాంటి వారిని వారికి అండగా ఉంటామని ప్రధానంగా శంకర్ యాదవ్ లాంటి యువ నాయకుడు యాదవ లు రాజకీయంగా ఎదిగేందుకు ముందుకు వస్తున్న తరుణంలో భవిష్యత్తు లో మంచి రాజకీయ యువ నాయకుడిగా శంకర్ యాదవ్ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో యువత శంకర్ యాదవ్ సేన, ధనుంజయ రాజా, సోము, మోహన్, భాను, పురుషోత్తం, గణేష్, మాజీ ఎంపిటిసిలు సదాశివం, విజయ్, టిడిపి నాయకులు ఈశ్వర్ రెడ్డి. చంద్రశేఖర్ నాయుడు, యువత బీసీలు శంకర్ యాదవ్ సేన పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షులు ఆరని విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం కూడలి వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టౌన్ : నియోజకవర్గ సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజలకు అండగా నిలుస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ ప్రజలకు హామీ ఇచ్చారు. గూడూరులో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. స్థానిక బనిగిసాహెబ్ పేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మేరిగ మురళీధర్, స్వచ్ఛఆంధ్ర ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, పార్టీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చేవూరి విజయమోహన్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్ రెడ్డి, కోడూరు మీరారెడ్డి, నాశిన నాగులు, బత్తిని విజయకుమార్, కొండూరు సునీల్ రెడ్డి, బాబు రెడ్డి, మగ్దూం మొహిద్దీన్, పూర్ణచంద్ర, అశోక్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, కుమార్ రాజా, అన్నం మురళి, హాషిమ్, సాయి, ముని పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -రేణిగుంట : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని మంగళవారం అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని సుమారు 38 సంవత్సరాల వయసు వున్న వ్యక్తి మృతి చెంది వుండడం కనిపించిందని స్థానికులు పేర్కొన్నారు. స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పౌష్టికాహార పక్షత్సవాలలో భాగంలో 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో నిర్వహిస్తారని పుత్తూరు ప్రాజెక్టు అధికారి పద్మజ తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. సిడిపిఓ పద్మజ కే యం అగ్రహారం, పరమేశ్వర మంగళం , ఎంబిరోడ్డు అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరై తల్లులకు పౌష్టికాహారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పిల్లలకు చిరుధాన్యాలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య శిబిరాలు, నిర్వహించాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు మునికుమారి, ధనమ్మ, హైమావతి, సూపరువైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రహ్మణ్యం గాజుల పెళ్లూరు ఎంపిపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో పిల్లలు ప్రార్థన సమయంలో పాల్గొని సలహాలు, సూచనలు అందించారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్నం పొంగలి, కోడి గుడ్డు, కుర్మా రుచి చూసి వాటిపై సలహాలు, సూచనలు అందించారు. విద్యార్థు లతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన కూరగాయలతో కూరలు చేసి పెట్టాలన్నారు. హాజరు శాతం తగ్గకుండా ఉండా లని డ్రాప్ అవుట్ విద్యార్థిని విద్యార్థులను వారి తల్లిదండ్రులతో మాట్లాడి అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలంలోని గోపాల కృష్ణాపురం ఉన్న త పాఠశాలలో 'జీవన జ్యోతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ' ఆధ్వర్యం లో 10వ తరగతి విద్యార్థు లకు మంగళ వారం పరీక్ష మెటీరియల్, రైటింగ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్, పెన్, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవనజ్యోతి సొసైటీ సంస్థ అధ్యక్షులు కట్టమంచి చిన్నబ్బ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడు తున్నామని అందులో భాగంగా విద్యార్థులకు విద్యా పరికరాలు అందించడం ఆనందంగా ఉందని, ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిఎస్ సుబ్బరాయన్, జీవనజ్యోతి సొసైటీ వైస్‌ప్రసిడెంట్ ఎంకె వడివేలు, ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారునికి విల్లు బహూకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ సేవా వారోత్సవాల్లో భాగంగా సీనియర్ రొటేరియన్ ఆడిటర్ రామ్మోహన్ రావు ఆర్థిక సహకారంతో చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూలులో 10 తరగతి చదువుతున్న లోకేష్‌కు మంగళవారం విల్లు బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మోహన్ రావుకి క్రీడలన్నా, క్రీడాకారులన్నా మక్కువ కావడం తో 15వేల రూపాయలు విలువ చేసే విల్లును బహూకరించారన్నారు. విలు విద్య ప్రాచీన విద్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి, ధనంజయ రెడ్డి, నాగులు, రాఘవరెడ్డి, హెడ్మాస్టర్ శ్రీనివాసులు , పిఈటి సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇనుప మంచం వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో మహిళా ఉద్యోగులు 10 వేలు రూపాయలు విలువ చేసే ఇనుప మంచాన్ని నగరిలోని సిరీస్ స్వచ్ఛంద సేవ సంస్థకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ కార్యదర్శి లక్ష్మణ కుమార్ మాట్లాడుతూ తమ యూనియన్ సామాజిక కార్యక్రమాల్లో ఎల్లవేళలా ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు. రమాదేవి, ఉషారాణి, మహావాణి, రాజేశ్వరి, మాధవి, బ్రాంచ్ అధ్యక్షులు దస్తగిరి, నాయకులు గణేష్ బాబు, రామకృష్ణ, పాఠశాల నిర్వాహకులు మా శిలామణి, గిరి , సుందరి, కల్పన పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని బూదూరు, తనియాలి, ఏకొల్లు, దొరవారిసత్రం గ్రామాలలో మంగళవారం సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఎవరికి వారుగా ప్రలోభాలకు గురికాకుండా సద్వినియోగం చేసుకునేందుకు సాయుధ బలగాలు ప్రజల్లో ఆత్మస్థైర్యం కలిగించారు. ఆ గ్రామాల్లోని ప్రజలు దృశ్యాలను చూసి జరిగే ఎన్నికలు కట్టుదిట్టంగా నిర్వహిస్తారని చర్చించుకుంటున్నారు. నాయుడుపేట రూరల్ సీఐ జగన్ మోహన్ రావు, దొరవారిసత్రం ఎస్సై తిరుమల రావు సారథ్యంలో ఈ సాయుధ బలగాల కవాతు నిర్వహించారు. వీరితోపాటు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రాజేష్, పలువురు పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించుకుందాం: తహశీల్దారు

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : ఎన్నికల నియమావళి నిబంధన ప్రకారంగా ఎన్నికలు నిర్వహణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా ఎన్నికల కమిషన్ నిబద్ధతతో పనిచేస్తుందని వెంకటగిరి తహశీల్దారు సాంబశివరావు అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఆరు మండలాల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి, బిజెపి, నాయకులు హాజరయ్యారు. ఈ సమా వేశంలో డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం అధికారులు పాల్గొన్నారు .

అన్నదానం

ప్రజాశక్తి-ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడు లోని శ్రీ వరసిద్ధి వినాయక , కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం లో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహి స్తున్నా రు. మంగళవారం ఉద యం పదిన్నర గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహిం చారు. మధ్యాహ్నం 12 గంట లకు సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్ల పాలెం శివయ్య, జ్ఞాన ప్రసన్న దంపతుల ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: TIRUPATI
I.A.No.581/2023, I.A.No.164/1999
O.S. No. 79 of 1989

B. Devakamma and 3 others ...Petitioners/Plaintiffs

V/s

B. Govindaswamy and 17others ...Respondents/defendants

NOTICE TO THE RESPONDENT/ DEFENDANT No. 9

R9) B. Vidyabushan, S/o not known to petitioners/plaintiffs, residing at D.No. 2-1-76/18, Kola Street, Tirupati

Please take notice that, the petitioners/plaintiffs filed the suit for partition and Interlocutory application for adding the legal representatives and consequential amendment and for passing final decree in the above Honourable Court against you and others and the above suit is posted to 29.04.2024 for your appearance. So, please to be attend on 29.04.2024 at 10.30 A.M. before the above Honourable Court either in person or through your advocate and file your objectioins if any, failing which the matter will be decided exparte against you on your absence.

Hearing date: 29.04.2024

M. JAYASANKAR
D. HEMAKUMAR
ADVOCATES, TIRUPATI